పీఎం విశ్వకర్మ యోజనాకు

దరఖాస్తు చేసుకోండి

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని.. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ ఫలాలు ప్రజలకు అందే విధంగా చొరవ చూపాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన కింద 18 కుల వృత్తుల వారికి రూ.3 లక్షల ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రెండు విడతల్లో రూ.3 లక్షలతో పాటు రూ.15 వేల కిట్, రూ.2500 స్టైఫండ్ కింద అందజేస్తారన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, రేషన్ కార్డు తీసుకువచ్చి కుత్బుల్లాపూర్ బీజేపీ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విశ్వకర్మ దరఖాస్తులు అందజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధం..

భారత దేశ ప్రజలు మరోసారి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి మూడో సారి అధికారం చేపడుతుందని కూన శ్రీశైలంగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మల్కాజిగిరి ఎంపీగా తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఇప్పటికే తన అభ్యర్థిత్వాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుంటానని తెలిపారు. తనకు అవకాశం కల్పిస్తే మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

దుండిగల్: కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. జీడిమెట్ల సూపర్ మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు మంగళవారం భూపతిరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సూపర్ మాక్స్ పరిశ్రమ యాజమాన్యం కంపెనీని లాకౌట్ చేసి దాదాపు 18 నెలలు గడుస్తోందన్నారు. అప్పటి నుంచి వెయ్యి మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. సంవత్సరం నుంచి రిలే నిరాహార దీక్షు చేస్తున్నప్పటికీ యాజమాన్యం తమను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన భూపతిరెడ్డి కార్మికుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చెరువు కబ్జాను అరికట్టడంలో విఫలం

జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బావిగడ్డ రవి

సుభాష్‌నగర్: కలెక్టర్ ఆదేశించినా రెవెన్యూ అధికారులు చెరువు కబ్జాను అరికట్టడంలో విఫలయ్యారని మేడ్చల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బావిగడ్డ రవి ఆరోపించారు. మంగళవారం బీజేపీ నాయకులు కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌ను కలిసి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గాజులరామారం డివిజన్ శ్రీకృష్ణనగర్ కాలనీని ఆనుకుని ఉన్న సర్వే నంబరు 23లో కొత్తకుంట చెరువును పరిరక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... కొందరు వ్యక్తులు చెరువును మట్టితో నింపి కబ్జా చేస్తున్న విషయమై ఆగస్టు 2న రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాను జారీ చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇది పరోక్షంగా కబ్జాదారులకు వత్తాసు పలికేలా అధికారులు చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా కొత్త కుంట చెరువును పరిరక్షించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు పత్తి రఘుపతి, తెలుకుల దుర్యోధనరావు తదితరులు ఉన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిదిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన 2024 నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ మంగళవారం ఆవిష్కరిచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, దేవస్థాన సభ్యులు ప్రకాష్ గుప్తా, తేరాల శ్రీనివాస్, వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ వేణుయాదవ్, రషీద్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది.. ఆయా డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయాలు, కమిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు అభయ హస్తం దరఖాస్తులను అందజేస్తున్నారు. జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు, నోడల్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

నేటి ప్రజాపాలన స్వీకరణ కేంద్రాలు..

దరఖాస్తులు స్వీకరించే బస్తీ, కాలనీలు ఇవే..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..

రంగారెడ్డినగర్ డివిజన్..

◆ గాంధీనగర్ కమిటీహాల్‌లో వెంకట్రామిరెడ్డినగర్, గురుమూర్తినగర్ కమిటీహాల్‌లో బీజేఆర్‌నగర్, ఆదర్శనగర్ కమిటీహాల్‌లో గుడెన్‌మెట్, రంగారెడ్డినగర్ సెయింట్ ఇషాక్ స్కూల్‌లో చెన్నారెడ్డినగర్.

సుభాష్‌నగర్ డివిజన్..

◆ సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో కుమ్మరిబస్తీ, ఎస్ఆర్ నాయక్ నగర్ కమిటీహాల్‌లో రాజ్యలక్ష్మీనగర్, అపురూపాకాలనీ కమిటీహాల్‌లో జైభీమ్‌నగర్, సూరారం లూయీ బ్రెయిలీ భవనంలో కృషికాలనీ.

కుత్బుల్లాపూర్ డివిజన్..

◆ పద్మనగర్ ఫేజ్-2 కమిటీహాల్‌లో బాపూనగర్,మాణిక్యనగర్ కమిటీహాల్‌లో మధుసూదన్‌రెడ్డి నగర్, వాణీనగర్ వినాయక మండపంలో దీనగర్, సాయినగర్, కల్పన సొసైటీ హాలులో సూర్యానగర్..

జీడిమెట డివిజన్..

◆ ప్రసూననగర్ కమిటీహాల్‌లో హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, దుర్గా ఎస్టేట్స్ కమిటీహాల్‌లో దుర్గా ఎస్టేట్స్, కుత్బుల్లాపూర్ గ్రామం సీనియర్ సిటిజన్స్ భవనంలో ప్రశాంత్‌నగర్, గాయత్రినగర్ వార్డు కార్యాలయంలో విమానపురి కాలనీ.

గాజులరామారం సర్కిల్ పరిధిలో..

గాజులరామారం డివిజన్..

◆ గాజులరామారం వార్డు కార్యాలయంలో షీర్డిహిల్స్, ఉషోదయ కాలనీ కమిటీహాల్‌లో మెట్‌కానిగూడ, దేవేందర్‌నగర్ కమిటీహాల్‌లో నర్సింహ బస్తీ, సుభాష్‌చంద్రబోస్ కమిటీహాల్‌లో ఎన్టీఆర్ నగర్.

జగద్గిరిగుట్ట డివిజన్..

◆ జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో రాజీవ్‌గృహకల్ప, దేవమ్మబస్తీ గణేష్ మండపంలో పాపిరెడ్డినగర్, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపంలో అంజయ్యనగర్, జగద్గిరినగర్ కమిటీ హాల్‌లో మగ్దూమ్‌నగర్.

చింతల్ డివిజన్..

◆ చింతల్ వార్డు కార్యాలయంలో భగత్‌సింగ్‌నగర్, ఎస్ఎల్‌బీనగర్ కమిటీహాల్‌లో షాపూర్‌నగర్, శ్రీనివాసనగర్ కమిటీహాల్‌లో రోడామేస్త్రీనగర్.

సూరారం డివిజన్..

◆ నెహ్రూనగర్ వార్డు కార్యాలయంలో మార్కండేయనగర్, రాజీవ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో రాజీవ్‌గాంధీనగర్, సూరారం అంబేడ్కర్ భవన్‌లో సూరారం గ్రామం, సంజయ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో ఏపీఐఐసీ కాలనీ.

నేడు సామూహిక వ్రతం

నిజాంపేట్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న తిరుప్పావై 18వ రోజును పురస్కరించుకుని నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని దక్షిణముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో సాయంత్రం 6.30 గంటలకు లక్ష్మీనారాయణస్వామి సామూహిక వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ వ్రతంలో పాల్గొనదలిచే దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి పూలు, పండ్లు, పూజా సామగ్రి, విష్ణుమూర్తి విగ్రహం లేక పటాలను తీసుకురావాలన్నారు. రాళ్లబండి రాఘవన్ ఆధ్వర్యంలో ఈ వ్రతం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసిన ఇస్మాయిల్



జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ గంపలబస్తీ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇస్మాయిల్ పుట్టిరోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. ఆయన మంగళవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులతో కలిసి నందిహిల్స్‌లోని కేసీఆర్ నివాసంలో కలిశారు.

ట్రాఫిక్ ఏసీపీ రణవీర్‌రెడ్డికి ఉత్తమ సేవా పతకం



గచ్చిబౌలి: మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణవీర్ రెడ్డిని ఉత్తమ సేవా పతకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గతంలోనూ రణవీర్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్, రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలు అందజేశాయి.

రింగ్‌బస్తీలో రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న స్థానికులు, సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: రింగ్‌బస్తీలోని రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రోడ్డును తవ్వి.. ప్రారంభిస్తున్నామని చెప్పి.. ఇంత వరకు పనులు మొదలు పెట్టలేదని మంగళవారం నిరసన తెలిపారు. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. తొందరగా పనులు ప్రారంభించకపోతే స్థానికులతో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ప్రవీణ్, శ్రీనివాస్, రాములు, సదానంద్, సుధాకర్, కరణ్‌సింగ్, చంద్ర, ఖాదర్, మహేందర్, మున్నీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మధుసూదనాచార్యాలు



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని నివాసంలో వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తమిళసైను కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదనాచార్యులు, కృష్ణచైతన్య రామానుజాచార్యులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

లోన్ పేరిట సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: లోన్ ఇప్పిస్తామని ఆశ చూపి ఓ వ్యక్తి నుండి సైబర్ మోసగాడు రూ. ఒక లక్ష 12 వేలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ ఆర్ ఆర్ హోమ్స్‌కు చెందిన వ్యక్తికి గత ఏడాది మే 5వ తేదీ లోన్ ఇప్పిస్తామని ఫోన్ కాల్ వచ్చింది.దీంతో అపరిచిత వ్యక్తి పెద్ద మొత్తంలో నగదు లోన్ ఇప్పిస్తామని ఆశ చూపి రూ. ఒక లక్ష,12 వేలు బాధితుడితో తన ఖాతాకు వేయించుకున్నాడు.దీంతో బాధితుడు లోన్ కోసం అపరిచిత వ్యక్తిని గట్టిగా అడగడంతో స్పందించలేదు.బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని పెట్రోల్ బంక్ వద్ద ఇలా..



వాహనాలన్నీ పెట్రోల్‌బంకుల వైపే..

రంగారెడ్డినగర్: దేశ వ్యాప్తంగా లారీ ఓనర్లు చేపట్టిన సమ్మెతో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీ క్యూలైన్‌లు కట్టారు.. కొందరు గంటల తరబడి లైన్లలో నిలుచుని మరీ పెట్రోల, డీజిల్ పోయించుకుని వెళ్లగా మరికొందరు అసహనంతో వెనుదిరిగారు. చాలా పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్, డీజిల్ నిండుకోవడంతో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద చూసినా మంగళవారం భారీ క్యూలైన్లలు కనిపించాయి. పెట్రల్ పోయించుకునేందుకు వాహనదారులు పోటీ పడ్డారు. ఒకరిని తోసుకుంటూ మరోకరి క్యూలైన్లలో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా చిన్నపాటి గొడవలు జరిగాయి. ఐడీపీఎల్, జీడిమెట్ల, గండిమైసమ్మ, షాపూర్‌నగర్.. ఇలా ఏ పెట్రోల్ బంకు వద్ద చూసినా వాహనదారులతో జనసందోహంగా మారాయి. లారీ ఓనర్ల సమ్మె తమకు తంటాలు తెచ్చి పెట్టిందని వాపోతున్నారు.

ఐడీపీఎల్‌లోని ఓ పెట్రోల్ బంక్ వద్ద పెద్ద సంఖ్యలో వాహనదారులు



నాలా పనులు త్వరగా పూర్తి చేయాలి



సుభాష్‌నగర్‌లో నిలిచిపోయిన పనులు

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ నుంచి మొదలుపెట్టిన నాలా పనులు తొందరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. 2019లో వర్షాలకు ఫాక్స్‌సాగర్ చెరువు పూర్తిగా నిండటంతో నీరు సుభాష్‌నగర్ కాలనీల్లోకి వచ్చి చేరింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అప్పట్లో ఇది సిటీలో హాట్ టాపిక్‌గా మారడంతో వివిధ పార్టీల నాయకులు వచ్చి కాలనీలోని ప్రజలకు ధైర్యం చెప్పి వెళ్లారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ఫాక్స్‌సాగర్ అలుగు నుంచి నాలాను నిర్మించేందుకు పూనుకుంది. దీనికి వ్యయంగా పాతిక కోట్ల పైనే బడ్జెట్‌ను రూపొందించారు. అప్పుడే పనులను ప్రారంభించి కొంతమేర పూర్తి చేసి వదిలేశారు.

పనులను తొందరగా పూర్తి చేయాలి..

400మీటర్ల నాలా పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్ నిధుల కొరతతో పనులను నిలిపివేశారు. దీంతో స్థానికులు చెత్తాచెదారాలు తీసుకువచ్చి నాలాలో పడేయటంతో నాలా నిండా చెత్త నిండిపోతుంది. చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో నాలా పరివాహక ప్రాంతంలో పందులు గుంపులుగా తిరుగాడుతున్నాయని వాటి వలన స్థానికంగా నివాసం ఉండే ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకుని తొందరగా నాలా పనులను పూర్తి చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జంట సర్కిళ్ల పరిధిలో 20,937 దరఖాస్తులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో అభయ హస్తం దరఖాస్తులను ప్రజలు పెద్ద సంఖ్యలో అందజేస్తున్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి రంగారెడ్డినగర్ డివిజన్‌లో 1891, సుభాష్‌నగర్ డివిజన్‌లో 3799, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 2557, జీడిమెట్ల డివిజన్‌లో 1948 మొత్తం 10,195 దరఖాస్తులు అందాయని సర్కిల్ అధికారులు తెలిపారు.

◆ గాజులరామారం సర్కిల్ పరిధిలో మంగళవారం 10,742 అభయ హస్తం దరఖాస్తులు అందాయని అధికారులు పేర్కొన్నారు. గాజులరామారం డివిజన్‌లో 3715, జగద్గిరిగుట్ట డివిజన్‌లో 2474, చింతల్ డివిజన్‌లో 2069, సూరారం డివిజన్‌లో 2484 దరఖాస్తులను స్వీకరించారు. కాగా దరఖాస్తుల్లో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, గృహలక్ష్మి పథకాలకు ప్రజలకు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

బాచుపల్లి ఎస్‌హెచ్ఓ సుమన్‌కుమార్ బదిలీ

నిజాంపేట్: బాచుపల్లి ఎస్‌హెచ్ఓ సుమన్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత సంవత్సరం ట్రాఫిక్ విభాగం నుంచి బాచుపల్లికి బదిలీపై వచ్చిన సుమన్‌కుమార్ నేరాల అదుపునకు తీవ్రంగా శ్రమించి మంచి ఫలితాలను సాధించారు. ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న జె.ఉపేందర్‌రావును బాచుపల్లి ఎస్‌హెచ్ఓగా బదిలీ చేశారు. దీంతో బాచుపల్లిలో విధులు నిర్వహిస్తున్న సుమన్‌కుమార్ రాజేంద్రనగర్ సీసీఎస్ జోన్‌కు బదిలీ చేశారు.

'మనూ'-టర్కీ యూనస్ ఎమ్రే ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయం-టర్కీ యూనస్ ఎమ్రే ఇన్‌స్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెండు సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో సంతకాలు చేశారు. ఉర్దూ యూనివర్శిటీ నుంచి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, ఆ సంస్థ పక్షాన టర్కీ కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్‌లు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రెండు సంస్థలు అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, ఉపన్యాసాలు అందించడం, పరిశోధనలో పాల్గొనడం, ఉమ్మడి ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, విద్యార్థుల మార్పిడి, నివాసి, నాన్‌రెసిడెంట్ ఫ్యాకల్టీ సభ్యుల మార్పిడి, ప్రాజెక్టు అభివృద్ధి, అమలు, విద్య, సాంస్కృతిక, శాస్త్రీయ విషయాలకు సంబంధించిన సామర్థ్యం పెంపుదల కోసం అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించడం, విశ్వవిద్యాలయం మిషన్లు, టర్కీ యొక్క అకడమిక్, సైంటిఫిక్ కో ఆపరేషన్ ప్రాజెక్టు పరిధిలో సమిష్టిగా కృషి చేయడంపై పరస్పర సహకారం అందించుకోవాలనే ఒప్పందం చేసుకున్నారు.

మాస్టర్ అథ్లెట్ రాష్ట్ర పోటీల్లో రంగారెడ్డి హవా

అభినందించిన జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్



పతకాలు సాధించిన వారితో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, సురేందర్

గచ్చిబౌలి: రాష్ట్ర స్థాయి 10వ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో 111 పతకాలు సాధించి రంగారెడ్డి జట్టు ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఈ పోటీల్లో రంగారెడ్డి జిల్లా నుంచి 33 మంది మహిళలు, 47 మంది పురుషులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. వీరంతా కలిసి 43 బంగారు, 33 రజత, 35 కాంస్య పథకాలను సాధించారు. బంగారు పతకాలను సాధించిన వారిలో ఏసురత్నం, మానసపతి, నాగలక్ష్మీ తదితరులు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్‌ను కలిశారు. పతకాలను సాధించిన వారిని వీరిద్దరు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలను ఫిబ్రవరి 9,10,11 తేదీలలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జనవరి చివరి వారంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

ఫస్ట్ బెటాలియన్‌లో ఘనంగా న్యూఇయర్ వేడుకలు

వెంగళరావునగర్: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ అరమరికలు లేకుండా కలిసిమెలిసి ఉండాలని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశసేవలో పాలు పంచుకోవాలన్నారు. తొలుత న్యూ ఇయర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అడిషనల్ కమాండెంట్ నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రాందాస్, సత్యనారాయణ, రంగారెడ్డి, జవహర్, నర్సింహులు, ఆర్ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృతిమ మేధస్సుపై విస్తృత పరిశోధనలు జరగాలి

బంజారాహిల్స్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను విస్తృతం చేసే దిశగా సాంకేతిక పరిశోధనలు కొనసాగాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్‌లోని కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ఆధ్వర్యంలో 'థింక్ ఏఐ' పేరిట ఏ-1 ఆధారిత సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. వివిధ యూనివర్సిటీల విద్యార్థులతో పాటు విద్యావేత్తలు, నిపుణులు, అధ్యాపకులు తమ పరిశోధనా సహకారాలు అందించే దిశగా సదస్సు కొనసాగింది. ఐఐటీ రూర్కీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి, సోనీ రీసెర్చ్ జపాన్ సీనియర్ రీసెర్చ్ ఇంజనీర్ డాక్టర్ గణేష్‌లతో పాటు జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ప్రసంగించారు. మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, ఏ1-ఎనేబుల్డ్ ఐఓటీ, సాఫ్ట్ కంప్యూటింగ్, ఎవల్యూషనరీ, స్వార్మ్ ఇంటెలిజెన్స్, బయో మెడికల్ టెక్నాలజీస్ వంటి అంశాలపై నిపుణులు మాట్లాడారు. ఈ సదస్సుకు మొత్తం 51 పరిశోధనలు పేపర్ ప్రజంటేషన్‌కు రాగా అందులో 10 మాత్రమే ఆమోదించారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ థింక్ ఏఐ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులపై చర్చించడంతో విజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడానికి ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు ఏఐ అండ్ డీఎస్ హెచ్ఓడీ డాక్టర్ సందీప్,బాచుపల్లి క్యాంపస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

హిమాయత్‌నగర్: సావిత్రీబాయి పూలే జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రటించాలని తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో సావిత్రీబాయి పూలే ఫౌండేషన్ అధ్వర్యంలో చేపట్టనున్న 193 జయంతి ఉత్సవాల వివరాలను ఫౌండేషన్ అధ్యక్షులు మీనుగ గోపి, సీఈఓ పరమేశ్వరి కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీబాయి పేరుతో ప్రత్యేక మహిళా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్య, వైద్యం, ఆర్థిక రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.